సాక్షి ఖమ్మం

మంగళవారం ၊ 18 ၊ ఫిబ్రవరి ၊ 2025



రాజుకుంటున్న మంటలు

దానవాయిగూడెం డంపింగ్‌యార్డ్‌లో వేసవి కాలం ప్రారంభానికి ముందే మంటలు లేవడం కలకలం సృష్టిస్తోంది. 8లో



పద్య గళార్చనకు స్పందన

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో నిర్వహించిన పద్య గళార్చనకు విశేష స్పందన లభించింది. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
36° / 19°

జిల్లాలో మంగళవారం ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రం అవుతుంది. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పశువైద్య శాఖ జేడీగా వెంకటనారాయణ



వెంకటనారాయణ

ఖమ్మంవ్యవసాయం : జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ కె. వెంకటనారాయణను నియమిస్తూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి గోష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్లుగా పనిచేస్తున్న ఐదుగురికి జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించి వివిధ జిల్లాల్లో నియమించారు. ఈ క్రమంలో హన్మకొండ జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ, ఖమ్మం పశుసంవర్ధక శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటనారాయణకు జేడీగా పదోన్నతి కల్పించి జిల్లాకు నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్



మాట్లాడుతున్న పూల రవీందర్

ఖమ్మం సహకారనగర్ : తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడుతానని వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. నగరంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కులను కాపాడేందుకే తాను బరిలో నిలిచానని చెప్పారు. తెలంగాణ ఉద్యమకాలంలో ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్‌గా వ్యవహరించానని, సకల జనుల సమ్మెలో పాల్గొని నాటి సీఎంను ఒప్పించి ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించానని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనను ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

కేఎంసీ అధికారులకు షోకాజ్ నోటీసులు !

ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఆదివారం కేఎంసీలో అందుబాటులో లేరని, ఎలాంటి సమాచారం లేకుండా బయటకు వెళ్లారని అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్యకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. శానిటరీ సూపర్‌వైజర్ నోటీసు తీసుకోగా, అసిస్టెంట్ కమిషనర్‌కు ఇంకా అందలేదని తెలిసింది. ఆదివారం డంపింగ్‌యార్డ్‌లో వ్యర్థాలకు మంటలు అంటుకున్న సమయంలో సంబంధిత అధికారులు ఎవరూ లేకపోవడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సోమవారం ఉదయం డంపింగ్‌యార్డ్‌ను సందర్శించిన శ్రీజ అధికారులకు షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశించినట్లు తెలిసింది.

సింగరేణిలో ఆరుగురు జీఎంల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు జీఎంలను బదిలీ చేస్తూ సోమవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. బెల్లంపల్లి జీఎం శ్రీనివాస్‌ను శ్రీరాంపూర్ ఏరియాకు, కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ విభాగం జీఎం ఎం.విజయ్‌భాస్కర్ రెడ్డిని బెల్లంపల్లి ఏరియాకు, కార్పొరేట్ విభాగం జీఎం మేకల కనకయ్యను కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ విభాగానికి బదిలీ చేసింది. ఆర్జీ–3 ఏరియాలో అడిషనల్ జీఎం కొలిపాక నాగేశ్వరరావును అడ్రియాల ప్రాజెక్ట్ జీఎంగా, మందమర్రి ఏరియా కేకే గ్రూప్ ఆఫ్ మైన్స్‌లో అడిషనల్ జీఎం వి.రామదాసును కార్పొరేట్ బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగం జీఎంగా, ఆర్జీ–2 ఏరియాలో అడిషనల్ జీఎం మధుసూదన్‌ను కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ జీఎంగా బదిలీ చేసింది.

ముత్తంగి అలంకరణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

కార్గోతో కాసులు



టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో కార్గో కాసుల పంట పండిస్తోంది. వినియోగదారులకు సైతం విస్తృత సేవలందిస్తూ ఆదరణ చూరగొంటోంది. కొరియర్ సేవలు ప్రారంభించిన 58 నెలల్లో రూ.కోట్లు ఆర్జించింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 3,29,743 పార్శిళ్ల బుకింగ్ ద్వారా రూ.6,49,30,640 ఆదాయం లభించింది. ఈ క్రమంలో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి నగరాలకు పరిమితమైన హోం డెలివరీ సౌకర్యాన్ని త్వరలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

గత ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.6.49 కోట్ల ఆదాయం

- కార్గోకు నానాటికీ పెరుగుతున్న ఆదరణ
- జిల్లా నుంచి హైదరాబాద్‌కు హోం డెలివరీ సౌకర్యం
- త్వరలోనే ఉమ్మడి జిల్లాలో అమలుకు కార్యాచరణ



ఖమ్మం కొత్త బస్టాండ్‌లో కొరియర్ బుక్ చేస్తున్న సిబ్బంది

కొరియర్ సర్వీస్‌కు బ్రాండ్..

2020 జూన్ 19న కార్గో సేవలు ప్రారంభించారు. అప్పటి నుంచి పార్శిళ్లను గమ్యస్థానాలకు చేర్చడంలో వినియోగదారుల నమ్మకాన్ని సంస్థ చూరగొంది. దీంతో ఇక్కడ సేవలు పొందే వారి సంఖ్య ప్రతీ ఏడాది పెరుగుతూ వస్తోంది. చిన్న కవర్ల నుంచి పెద్ద పార్శిళ్లు, కంప్యూటర్లు, వ్యవసాయ పనిముట్లు, ఇతర సామగ్రి ఏదైనా కార్గోలో సురక్షితంగా, తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుతోంది. దీంతో అందరూ ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రైవేట్ కొరియర్ సర్వీసుల చిరునామాలకు ఇబ్బంది పడాల్సి రావడం, కొన్ని వస్తువులను వారు అంగీకరించకపోవడంతో అందరూ కార్గో బాట పట్టారు. ఈ సేవలు ఆర్టీసీ బస్టాండ్లలో లభిస్తుండటంతో అడ్రస్ కోసం వెదుక్కోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎవరికైనా పార్శిల్ పంపించాలంటే మొదట గుర్తొచ్చేది కార్గోనే అనేలా కొరియర్ సర్వీస్‌కు బ్రాండ్‌గా మారింది.

ఏడాదిలో రూ.6.49 కోట్లు..

టీజీఎస్ ఆర్టీసీకి కార్గో ఆదాయ వనరుగా మారింది. ఈ సేవలను ప్రారంభించిన తొలి ఏడాదిలో రూ.1.71 కోట్లు రాగా.. ఆ తర్వాత ప్రతి ఏడాది ఆదాయం పెరుగుతూ వస్తోంది. 2023 –24లో రూ.7.24 కోట్లు వచ్చింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 3,29,743 పార్శిళ్ల బుకింగ్ ద్వారా రూ.6,49,30,640 ఆదాయం వచ్చింది. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, భద్రాచలం, మణుగూరు, మధిర, ఇల్లెందు డిపోల నుంచి ఇతర ప్రాంతాలకు, అక్కడి నుంచి ఇక్కడికి పార్శిళ్లు వస్తుంటాయి. అయితే ఆదాయం పెరగడంలో కార్గో సిబ్బందితో పాటు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల కృషి ఎంతో ఉంది. అత్యధికంగా మేలో జిల్లాలో 35,199 పార్శిళ్ల బుకింగ్ ద్వారా రూ.68,46,890 వచ్చాయి. అలాగే డిసెంబర్‌లో 33,588 పార్శిళ్ల ద్వారా రూ.68,97,835 ఆదాయం లభించింది. అలాగే ఇతర ప్రాంతాలకు 1,740 పార్శిళ్ల హోం డెలివరీ ద్వారా కార్గో రూ.4,84,050 ఆదాయం పొందింది.

కచ్చితమైన సేవలు..

ఆర్టీసీ కొరియర్ సర్వీస్ ద్వారా వస్తువులను పంపించడం సులువుగా మారింది. పార్శిల్ ఇవ్వగానే ఆర్టీసీ బస్ ద్వారా పంపుతుండగా వేగంగా గమ్యస్థానాలకు చేరుతున్నాయి. బుక్ చేసిన వెంటనే, డెలివరీ అయిన తర్వాత సెల్‌కు మెసేజ్ వస్తుండడంతో ఎలాంటి భయం లేకుండా పోతోంది. ఖరీదైన వస్తువులను కూడా కార్గో ద్వారా పంపించేందుకు ఎవరూ వెనుకాడడం లేదు. ఆర్టీసీ సంస్థ సైతం వినియోగదారులకు జవాబుదారీగా వ్యవహరిస్తూ ఎలాంటి రిమార్క్ లేకుండా సేవలందిస్తోంది.

2024, ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కార్గోకు వచ్చిన ఆదాయం వివరాలు (రూ.లలో)

నెల	పార్శిల్స్	ఆదాయం
ఏప్రిల్	29,244	57,04,840
మే	35,199	68,46,890
జూన్	30,458	60,61,210
జూలై	29,384	56,12,285
ఆగస్ట్	30,358	58,01,695
సెప్టెంబర్	27,809	53,90,575
అక్టోబర్	31,650	61,64,170
నవంబర్	32,896	66,24,995
డిసెంబర్	33,588	68,97,835
జనవరి	32,287	64,94,285
ఫిబ్రవరి (ఇప్పటివరకు)	16,870	33,31,860

త్వరలో ఇక్కడా హోం డెలివరీ..



వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో మాత్రమే హోం డెలివరీ సౌకర్యం ఉండగా త్వరలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ అవకాశాన్ని కల్పిస్తాం. ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. హోం డెలివరీ సౌకర్యంతో వినియోగదారులకు మరింతగా సేవలు అందుబాటులోకి రానున్నాయి.

– వి.రామారావు, మేనేజర్, ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం లాజిస్టిక్స్

కాంగ్రెస్ పాలనలోనే గిరిజన సంక్షేమం



పొంగులేటిని గజమాలతో సత్కరిస్తున్న గిరిజన పెద్దలు

- సేవాలాల్ సిద్ధాంతాలను ఆచరించాలి
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

కూసుమంచి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గిరిజనులకు సంక్షేమం అందుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచిలో సోమవారం నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హింస, కరుణ, మద్యపాన నిషేధం తదితర అంశాలపై సేవాలాల్ సమాజ హితానికి పాటుపడ్డారని, మానవుడి రూపంలో ఉన్న భగవంతుడిగా మారారని అన్నారు. ఆయన సిద్ధాంతాలను నేటి తరం వారు ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి మహనీయుడి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆదివాసీల గౌరవాన్ని పెంచేలా కృషి చేస్తోందని చెప్పారు. ఇందిరా గాంధీ పాలనలోనే బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చారని, దీంతో కలిగిన రిజర్వేషన్‌తో నేడు గిరిజనులు విద్య, ఉద్యోగావకాశాలు పొందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి గిరిజనులకు మధ్య బంధం విడదీయలేమని, ఇందిరమ్మ రాజ్యంలో గిరిజనులు సుఖ సంతోషాలతో ఉంటారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తామంతా శ్రమించి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. ఈ సందర్భంగా పొంగులేటిని గిరిజన పెద్దలు తలపాగా చుట్టి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బాణోత్ శ్రీనివాస్ నాయక్, బోడ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బీజేపీ అండగా ఉంటుంది



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

- నరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

ఖమ్మంమయూరిసెంటర్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. సోమవారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి, ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయుల ఓట్లతో శాసనమండలికి వెళ్లిన ఎమ్మెల్సీలు టీచర్ల సమస్యలపై ఎప్పుడూ మాట్లాడలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో సరోత్తంరెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. తొలుత బీజేపీ జిల్లా నాయకులు ఈటలకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

- తెలంగాణ కోసం 35 పార్టీలను కేసీఆర్ ఏకం చేశారు
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



కేక్ కట్ చేస్తున్న పువ్వాడ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్ : కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఆయన కేక్ కట్ చేయడంతో పాటు మమత ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ సాధనకు 35 పార్టీలను ఏకం చేసి పోరాడిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గురుకుల పాఠశాలల్లో చేరేందుకు కొన్ని వేల దరఖాస్తులు వచ్చేవని, ఇప్పుడు సరైన సదుపాయాలు లేక దుర్భర పరిస్థితి నెలకొందని ఆరోపించారు. రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు తాజుద్దీన్, వీరునాయక్, కొల్లు పద్మ, షకీనా పాల్గొన్నారు.

ఎన్‌క్వాస్ బృందం వర్చువల్ తనిఖీ

చింతకాని : మండల పరిధిలోని నేరడలో గల ఆయుష్మాన్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్ (ఎన్‌క్వాస్) బృందం సభ్యులు డాక్టర్ కుమార్ భార్గవ్, డాక్టర్ పుష్పలత సోమవారం వర్చువల్‌గా తనిఖీ చేశారు. ఎన్‌క్వాస్ నిబంధనలకు అనుగుణంగా ఆరోగ్య కేంద్రంలో ఏడు విభాగాలకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నుంచి అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి రామారావు, జిల్లా ప్రోగ్రాం అధికారి దుర్గ, మండల వైద్యాధికారులు డాక్టర్ ఆల్తాఫ్, సాయికుమార్, సీహెచ్‌ఓ వీరేందర్, పల్లె దవాఖానా వైద్యులు సోహెల్, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, నాగేశ్వరరావు, రేచల్ రాణి, జ్యోతి రత్న పాల్గొన్నారు.

నేడు స్తంభాద్రి గిరి ప్రదక్షిణ ప్రారంభం

2 కి.మీ. యాత్ర అనంతరం దివ్యజ్యోతి దర్శనం



గిరి ప్రదక్షిణ ప్రారంభమయ్యే ఆలయ ఘాట్ రోడ్

ఖమ్మంగాంధీచౌక్ : త్రేతాయుగం నాటి స్వయంభు దివ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న ఖమ్మం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి(గుట్ట) సన్నిధిలోని కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ కార్యక్రమం మంగళవారం ప్రారంభం కానుంది. స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5:30 గంటలకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తారు. నృసింహ నామ స్మరణ, కీర్తనలు ఆలపిస్తూ నిర్వహించే ఈ కార్యక్రమంలో కోలాట బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రదక్షిణ అనంతరం 6:30 గంటలకు కొండ మీద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై దివ్య జ్యోతి దర్శనం చేసుకునేలా కార్యక్రమాన్ని రూపొందించారు. గిరి ప్రదక్షిణ స్తంభాద్రి ఘాట్ రోడ్ గేటు వద్ద ప్రారంభమై ఎన్‌ఎస్‌పీ రోడ్, కవిత డిగ్రీ, పీజీ కళాశాల, స్తంభాద్రి మండపం, సరిత క్లినిక్, ఎల్‌ఐసీ కార్యాలయం మీదుగా తిరిగి గేటు నుంచి ఘాట్ రోడ్ ద్వారా గుట్టపై ఉన్న నృసింహుని ఆలయానికి చేరుతుంది.

మహిళా మార్ట్ ప్రత్యేకత చాటాలి

- ఘనంగా ఏర్పాట్లు చేయండి
- అధికారులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచన



యూబీఐ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, బ్యాంక్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్ : మహిళా మార్ట్ ప్రత్యేకత చాటి చెప్పేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. నగరంలోని సీక్వెల్ రోడ్డులో మహిళా మార్ట్ ఏర్పాటు చేయనున్న భవనాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్ట్ ముందు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, స్లైడింగ్ గేట్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొదటి సారి మహిళలతో ఏర్పాటు చేస్తున్నామని, ఆ తర్వాత నగరంలో మరి కొన్నింటి ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని వివరించారు. స్వశక్తి మహిళా సంఘాల వారు తయారుచేసిన పదార్థాలు, వస్తువులను ఇందులో విక్రయిస్తామని, ఉత్పత్తుల వివరాలు, తయారీ విధానం, అమ్మే మహిళ స్టోరీని డాక్యుమెంట్ చేస్తూ ప్రదర్శించాలని అన్నారు. మార్చి మొదటి వారంలోగా మహిళా మార్ట్ ఏర్పాటయ్యేలా కార్యాచరణ ఉండాలని, ప్రతి వస్తువుపై 'మేడ్ ఇన్ ఖమ్మం' అనే స్టిక్కర్ వేయాలని సూచించారు. మహిళా మార్ట్‌కు అవసరమైన నిధులను డీఆర్‌డీఏ ద్వారా రెండు రోజుల్లో అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, పీఆర్ ఈఈ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూబీఐ బ్రాంచ్ ప్రారంభం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ముస్తఫానగర్ బ్రాంచ్‌ను కలెక్టర్ ముజిమ్మల్ ఖాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యూబీఐ ముందుంటుందని చెప్పారు. అనంతరం స్వయ సహాయక సంఘాలకు, విశ్వకర్మ, పీఎంఈజీపీ లబ్ధిదారులకు కలెక్టర్ చేతుల మీదుగా మంజూరుపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఖమ్మం రీజినల్ హెడ్ హనుమంత రెడ్డి, డిప్యూటీ రీజినల్ హెడ్ సర్వేశ్, సుధాకర్, బ్రాంచ్ మేనేజర్ సల్మా పర్వీన్, శ్రీరామ్ హిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బెల్లం మనోహర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి

ఖమ్మం సహకారనగర్ : ప్రజలు అందించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన ఎం.సీత పేదరికంలో ఉన్న తనకు ఖమ్మం దగ్గరలో ఉన్న బీసీ గురుకులంలో స్వీపర్ పోస్ట్ ఇప్పించాలని విన్నవించారు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడు ప్రాథమిక పాఠశాలలో రూ.7.50 లక్షలతో టాయిలెట్ల మరమ్మతులు, విద్యుత్, నీటి వసతి పనులు చేశామని, తమకు అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.25 వేలు మినహా ఏ బిల్లూ రాలేదని, త్వరగా ఇప్పించాలని గ్రామానికి చెందిన బి.విజయ కోరారు.

ఆర్థోపెడిక్ వైద్యుడికి ఉత్తమ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ హనుమాన్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న హనుమాన్ ఉత్తమ డాక్టర్ అవార్డు పొందారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఈ నెల 13 నుంచి 16 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్థోపెడిక్ సదస్సుకు ఆయన హాజరయ్యారు. రోడ్డు ప్రమాదంలో విరిగిన కాలు ఎముకలకు ఇతర పద్ధతుల్లో రాడ్లు వేసే ఆపరేషన్ల గురించి ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. చీము పట్టినప్పుడు ఎముకలను తీసేయకుండా చేస్తున్న ఇలిజారోవ్ ఆపరేషన్ల గురించి వివరించారు. ఈ ప్రెజెంటేషన్‌కు గాను ట్రామా విభాగంలో బెస్ట్ డాక్టర్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా హనుమాన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ వద్దిరాజు


శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులకు కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామూనాయక్

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు ప్రారంభించారు. గతేడాది ఏప్రిల్, సెప్టెంబర్‌లో రెండు పర్యాయాలు 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 71,086 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా అందులో జిల్లా వ్యాప్తంగా 3,350 మంది విద్యార్థులకు వివిధ రకాల కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారికి జిల్లాలోని సత్తుపల్లి, పెనుబల్లి, నేలకొండపల్లి ఆస్పత్రుల్లో పరీక్షలు నిర్వహించనుండగా.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రోజూ 150 మందిని పరీక్షించనున్నారు. సాధారణ సమస్యలకు జిల్లాలోనే వైద్య సేవలు అందిస్తుండగా, తీవ్రంగా ఉన్న విద్యార్థులను హైదరాబాద్ తరలించి చికిత్స అందించనున్నారు.

ఈజీఎస్ జాబ్ కార్డులు అప్‌డేట్ చేయాలి


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: ఈజీఎస్ కూలీల జాబ్ కార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ చుంచు శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరంలో ఆయన మాట్లాడారు. తొలుత 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు ఈజీఎస్ ద్వారా మండలంలో చేపట్టిన పనుల వివరాలను ఓపెన్ ఫోరంలో గ్రామాల్లో ఆడిట్ జరిపిన 12 బృందాల నివేదికలను చదివి వినిపించారు. కూలీల హాజరు – కొలతల్లో గమనించిన తేడాలను వెంటనే రికవరీ చేయాలని సంబంధిత అధికారులను అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి టి.సక్రియానాయక్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, అంబుడ్స్‌మెన్ రమేశ్‌బాబు, ఎంపీడీఓ సురేందర్, ఏపీఓ కె.నాగరాజు, విజిలెన్స్ సూపరింటెండెంట్ వీవీఎస్ శాస్త్రి, అసిస్టెంట్ మేనేజర్ పవన్, ఎస్‌ఆర్‌పీ సాంబశివాచారి, ఎంపీఓ జి.శ్రీలక్ష్మి, ఆర్ఐ బి.రాజశేఖర్, పీఆర్ ఏఈ నరేశ్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు సత్తాచాటాలి


మాట్లాడుతున్న చిరంజీవులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని రిటైర్డ్ ఐఏఎస్, మేధావుల సంఘం చైర్మన్ చిరంజీవులు పిలుపునిచ్చారు. ఐక్య వేదిక సమావేశం ఆర్జేసీ కృష్ణ అధ్యక్షతన ఖమ్మంలో నిర్వహించగా చిరంజీవులు పాల్గొని మాట్లాడారు. తాను 1931 జనగణనను అధ్యయనం చేశానని, ఇటీవల రాష్ట్రంలో జరిగిన జనగణనలో బీసీల జనాభాను తగ్గించి ఓసీల జనాభాను పెంచారని తెలిపారు. 8 శాతం ఉండాల్సిన ఓసీ జనాభా 13 శాతానికి పెంచి.. 56 శాతం ఉండాల్సిన బీసీ జనాభాను 46 శాతానికి తగ్గించినట్లు వివరించారు. బీసీలంతా ఏకమై హక్కుల సాధనలో రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కూరపాటి వెంకటేశ్వర్లు, బొమ్మా రాజేశ్వరరావు, కత్తి నెహ్రూగౌడ్, పసుపులేటి నర్సయ్య, పద్మ, డాక్టర్ కేవీ కృష్ణారావు, షేక్ షకీన, సోమరాజ్, రాంబాబు, మాటేటి కిరణ్, పెళ్లూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండాకు చెందిన ఈ.రమేశ్ ద్విచక్రవాహనం చోరీకి గురికాగా.. సోమవారం రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి రమేశ్ గ్రామ సెంటర్‌లో ఉన్న సెలూన్‌లో హెయిర్ కటింగ్ చేయించుకుని బయటకు రాగా.. ద్విచక్రవాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజుకుంటున్న మంటలు

- డంపింగ్‌యార్డ్‌లో అగ్ని ప్రమాదం
- కుప్పలుగా పేరుకుపోతున్న వ్యర్థాలతో ఆందోళన
- సిబ్బంది నిర్లక్ష్యంతోనే మంటలు వ్యాపించాయని ఆరోపణలు


డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్: కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న దానవాయిగూడెం ప్రాంతంలోని డంపింగ్‌యార్డ్‌లో మళ్లీ మంటలు కలకలం సృష్టించాయి. వేసవి కాలం ప్రారంభానికి ముందే మంటలు అంటుకొని వ్యర్థాలు కాలిపోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. డంపింగ్‌యార్డులో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోవడం, వాటిని తొలగించకపోవడంతో ఈ సమస్య పునరావృతం అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక ఆదివారం డంపింగ్‌యార్డులో మంటలు చెలరేగడానికి కారణం ఎవరైనా నిప్పు పెట్టి ఉంటారా? అనే అనుమానాలు అధికారులు నుంచి వ్యక్తమవుతున్నాయి. మంటలను వెంటనే గుర్తించి ఫైరింజన్‌తో అదుపు చేయడం వల్ల యార్డు మొత్తం మంటలు వ్యాపించకుండా అడ్డుకున్నట్లు స్థానిక సిబ్బంది పేర్కొంటున్నారు. మంటలు పెరిగితే పెద్ద మొత్తంలో పొగ చుట్టు పక్కల ప్రాంతాలను కమ్మేసి ఉండేదని, స్థానిక ప్రజలు ఇబ్బందిపడే వారని ఆ ప్రాంత వాసులు చర్చించుకున్నారు.

గుట్టలుగా వ్యర్థాలు..

డంపింగ్‌యార్డులో దశాబ్దాల కాలం నాటి వ్యర్థాలను తొలగించేందుకు బయో మైనింగ్ ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియ గత మూడేళ్లకు పైగా కొనసాగుతూనే ఉంది. అయినా వ్యర్థాల గుట్టలు అలాగే పేరుకుపోయి ఉన్నాయి. ఇక రోజు వారీగా వచ్చే 180 మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలు ఇక్కడే పోస్తుండటంతో డంపింగ్ యార్డు అంతా వ్యర్థాలతో నిండిపోతోంది. డంపింగ్‌యార్డు ఇన్‌చార్జ్‌లు పట్టించుకోకపోవడంతో గుట్టలుగా పోయాల్సిన వ్యర్థాలను దారి పొడవునా డంప్ చేస్తూ యార్డులో ఉన్న స్థలాన్ని వ్యర్థాలతో నింపారు.

సిబ్బంది నిర్లక్ష్యం..

డంపింగ్‌యార్డు నిర్వహణకు కేఎంసీ అధికారులు.. సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించారు. ఓ ఉద్యోగిని డంపింగ్‌యార్డుకు ఇన్‌చార్జ్‌గా కేటాయించి.. ఆయన ఆధ్వర్యంలో మరో నలుగురిని డంపింగ్‌యార్డు పర్యవేక్షకులుగా నియమించారు. అయితే వీరు అక్కడ విధులు నిర్వహించాల్సిన సమయంలో కేఎంసీ కార్యాలయంలో, బయట ప్రాంతాల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నట్లు విమర్శలున్నాయి. ఏడాది కాలంలో మంటలు లేకుండా ప్రశాంతంగా ఉన్న డంపింగ్‌యార్డులో ఇప్పుడు మంటలు ఎలా వచ్చాయనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మంటల వ్యాప్తికి కారణం బయట వ్యక్తులా? లేక ఇక్కడి సిబ్బంది నిర్వాకమేనా..? కాగితాలు ఏరుకునే వారా..?అనేది తెలుసుకునేందుకు అధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది.

నిరంతర పర్యవేక్షణ అవసరం..

డంపింగ్‌యార్డ్‌లో వ్యర్థాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ అవసరం ఉంది. డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని స్థానికులు ఆందోళన చేస్తున్న తరుణంలో వ్యర్థాలకు మంటలు వ్యాపించడం కొంత ఆందోళనకరమైన విషయంగా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఇక్కడ మంటలు ఎలా వ్యాపిస్తున్నాయో పసిగట్టవచ్చని చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని సీసీ కెమెరాలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసినా.. వీటిని డంపింగ్‌యార్డ్‌కు అన్ని వైపులా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సందర్శన..


డంపింగ్ యార్డులో వ్యాపించిన మంటలు

డంపింగ్ యార్డులో ఆదివారం మంటలు రావడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ పి.శ్రీజ సోమవారం డంపింగ్ యార్డును సందర్శించారు. మంటలు చెలరేగిన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. మంటలు రావడానికి కారణమేంటని కేఎంసీ ఈఈ కృష్ణాలాల్‌ను అడిగారు. వ్యర్థాల కుప్పలు పేరుకుపోయినప్పుడు లోపలి నుంచి వేడికి మంటలు వ్యాపించే అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్‌కు తెలిపినట్లు సమాచారం. అరెకరం మేరకు వ్యర్థాలు కాలినట్లు అధికారులు గుర్తించారు. ఇక సోమవారం ఉదయం కూడా పొగలు రావడంతో ఎప్పటికప్పుడు వ్యర్థాలపై మట్టిపోస్తూ మంటలు రాకుండా స్థానిక సిబ్బంది అడ్డుకున్నారు.

కనకగిరి అడవుల్లో జీవ వైవిధ్యం


అరుదైన సరీసృపం


కనకగిరి అడవుల్లో కనిపించిన అరుదైన జాతి పాము

ఖమ్మంవన్‌టౌన్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తరించి ఉన్న కనకగిరి రిజర్వు ఫారెస్ట్ జీవ వైవిధ్యానికి చిరునామాగా మారింది. వన్యప్రాణి నిపుణులు ఆదివారం ఈ అడవిలో 12 గంటల పాటు కాలి నడకన పర్యటించారు. ఈ సందర్భంగా బ్లూ – ఇయర్డ్ కింగ్‌ఫిషర్ (లకుముకిపిట్ట)ను గుర్తించారు. జిల్లాలోని సత్తుపల్లి డివిజన్ తల్లాడ పరిధిలోని కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్‌లో చేపట్టిన ఈ వాక్‌లో వృక్షాలు, జంతువులకు సంబంధించిన వైవిధ్యాన్ని కనుగొన్నారు. 12 మంది వన్యప్రాణి నిపుణులు నాలుగు కిలోమీటర్ల అడవిని అన్వేషించి.. 65 పక్షిజాతులు, 5 క్షీరద జాతులు, 5 చేప జాతులను డాక్యుమెంటరీ రూపంలో రికార్డు చేశారు. ఇక మిగిలిన పక్షులలో బ్లాక్-వింగ్డ్ ష్రైక్, రూఫస్ వడ్రంగిపిట్ట, వైట్-రంప్డ్ మునియా, బ్లూ-త్రోటెడ్ బ్లూ ఫ్లైక్యాచర్, బ్లాక్-రంప్డ్ షామా ఉన్నాయి. ఇక్కడి ప్రకృతి దృశ్యాలు, వన్యప్రాణుల రకాలు ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంగా ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైల్డ్ తెలంగాణ నుంచి ప్రదీప్ ప్రాజ్, మీరాకి ఆర్గనైజేషన్ నుంచి నవీన్ బాలా, ఎ.సుజిత్, వి ఊల్ఫ్ ఫౌండేషన్ నుంచి పి.హరికృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు తొలగింపుపై ఆందోళన


తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన బాధితులు

నేలకొండపల్లి: కొత్తగా పెళ్లి అయిందని సాకు చూపి.. 26 ఏళ్ల కిందట పెళ్లయిన ఓ కుటుంబం రేషన్ కార్డును తొలగించారు. దీనిపై బాధితులు గ్రీవెన్స్‌లో మొరపెట్టుకోగా.. చర్యలు చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన వీరబాబు – రాధిక దంపతులకు 26 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలుండగా.. పెద్ద కుమార్తెకు వివాహమైంది. వీరికి రేషన్ కార్డు ఉంది. జనవరి రేషన్ తీసుకున్న వీరు.. ఫిబ్రవరి కోటా తీసుకునేందుకు రేషన్ దుకాణానికి వెళ్లగా రేషన్ కార్డు తొలగించినట్లు తెలిసింది. రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి విచారించగా.. కొత్తగా పెళ్లి కావడంతో రేషన్ కార్డు తొలిగించారని చెప్పడంతో ఖంగుతిన్నారు. తాము ఫిర్యాదు, దరఖాస్తు చేయకుండా ఎలా తొలగిస్తారని, అధికారుల ప్రమేయం లేకుండానే ఈ ప్రక్రియ ఎలా జరుగుతుందని బాధితులు సోమవారం గ్రీవెన్స్‌లో ఆందోళనకు దిగారు. కాగా, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.మానిక్‌రావు హామీ ఇవ్వటంతో బాధితులు ఆందోళన విరమించారు.

జ్యూయలరీ దుకాణంలో చోరీకి యత్నం..

అద్దెకున్న వాళ్లు లేవడంతో ప్రయత్నం విఫలం


దుండగులు తొలగించిన జ్యూయలరీ దుకాణం షట్టర్


దొంగతనానికి వచ్చిన వారు ఉపయోగించిన వాహనం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఝాన్సీ జ్యూయలరీ దుకాణంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఓ దొంగల ముఠా బొలేరో వాహనంలో లక్ష్మీనగరం గ్రామంలోని ఝాన్సీ జ్యూయలరీ దుకాణంలో దొంగతనానికి ప్రయత్నించింది. దుకాణం షెట్టర్ తొలగించి లోపలి కౌంటర్‌ను తోయగా ఆ శబ్దం విన్న వెనుక అద్దెకు ఉండే వారు నిద్ర లేచి బయటకు రావడంతో వారు పరారయ్యారు. సమాచారం అందుకున్న సీఐ అశోక్, ఎస్‌ఐలు వెంకటప్పయ్య, గణేశ్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు ఆధారాలను సేకరించారు. జ్యూయలరీ దుకాణంలో ఏమీ చోరీకి గురికాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పక్కా స్కెచ్..

దొంగలు లక్ష్మీనగరం గ్రామంలోని జ్యూయలరీ దుకాణంలో చోరీ చేసేందుకు పక్కా ప్రణాళికతో వచ్చినట్లు సీసీ కెమెరాల ఆధారంగా తెలుస్తోంది. భద్రాచలం వైపు నుంచి బొలేరో వాహనం చర్ల వైపు వెళ్తూ యూటర్న్ తీసుకుని వెనక్కి వచ్చి ఓ స్వీట్ షాప్ దగ్గర నిలిపి, అక్కడి నుంచి దొంగలు ఝాన్సీ జ్యూయలరీ దుకాణం వద్దకు వెళ్లినట్లు సీసీ కెమెరాలో కనిపిస్తోంది. వాహనంలో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగి జ్యూయలరీ దుకాణం వ్దకు వెళ్లగా వాహనం రివర్స్‌లో దుకాణం వద్దకు వెళ్లింది. షట్టర్ తొలగించి కౌంటర్‌ను తోయడం.. వెనుక ఉన్న వాళ్లు లేవడం.. దొంగలు పరారుకావడం కూడా నిఘా నేత్రాల్లో నిక్షిప్తమైంది. అనంతరం వారు వెళ్తూ కూడా టార్చిలైట్ వేసి దుకాణాలను పరిశీలించి వెళ్లారు. తొలుత అర్ధరాత్రి 2.01 గంటలకు సాయితిరుమల ఇంజనీరింగ్ వర్క్స్ దుకాణం వద్దకు వెళ్లారు. మరోసారి 3.28 గంటలకు సమయంలో మరోసారి ఆ దుకాణం వద్దకు వెళ్లగా లోపల నిద్రిస్తున్న వ్యక్తులు లేవగా హిందీలో తాగునీరు కావాలని అడిగినట్లు తెలిసింది.

వేమన పద్య గళార్చనకు స్పందన


వేమన పద్య గళార్చన చేస్తున్న విద్యార్థులు

సత్తుపల్లి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఏకకంఠంతో వేమన పద్యాలను చూడకుండా చదివి వినిపించడంతో జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణం పులకరించింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి మండలానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రెండు వందల మంది ఏకగళంతో వేమన పద్యాలను సోమవారం చదివి వినిపించారు. జేవీఆర్ డిగ్రీ కళాశాలలో గార్లపాటి, బొల్లేపల్లి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగుశాఖ, ఆషా, లైవ్, సృజన స్వచ్ఛంద సంస్థలు, మండల విద్యాశాఖ సహకారంతో వేమన శతక పద్య గళార్చన పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించగా జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించే దిశగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను, సహకరిస్తున్న సంస్థలతోపాటు కేవలం మూడు నెలల వ్యవధిలో విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మట్టా రాగమయి తరఫున విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పాఠశాలలకు జ్ఞాపికలు అతిథుల చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన్‌రాజు, కిశోర్‌రెడ్డి, నాగేశ్వరరావు, జేవీఆర్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పూర్ణచందర్‌రావు, రిటైర్డ్ టీచర్ కళ్యాణశర్మ, అయ్యదేవర శేషగిరిరావు, మాలతి, మల్లికార్జున్‌రావు, రమణమూర్తి, గట్టే వాసు, గంద్ర కిశోర్‌కుమార్‌రెడ్డి, దొడ్డా కృష్ణయ్య, పసుపులేటి నాగేశ్వరరావు, పల్లం పిచ్చయ్య, ఖాసీం, ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్


దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ, అధికారులు

భద్రాచలం: గిరిజన దర్బార్‌లో ఇచ్చే ఫిర్యాదులను అర్హత మేరకు సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అధికారులకు సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులను స్వీకరించారు. గిరిజనుల సమస్యలు తెలుసుకొని సంబంధిత యూనిట్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. ఐటీడీఏకు వచ్చే గిరిజనుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అనంతరం సింగరేణి మండలానికి చెందిన బాలు తమ గ్రామానికి కరెంట్ కనెక్షన్ ఇప్పించాలని, ములకలపల్లి మండలం చింతపేట రైతులకు బోర్లు, కరెంటు మోటార్లు ఇప్పించాలని, అశ్వారావుపేట మండలం తిరుమలకుంటలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని ఆ గ్రామస్తులు వినతిపత్రాలు సమర్పించారు. ఇంకా గుండాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన వెంకయ్య సోలార్ విద్యుత్‌తో బోర్ కనెక్షన్ ఇవ్వాలని.. ఇలా పలువురు దరఖాస్తులు అందజేయగా సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. దర్బార్‌లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ చంద్రశేఖర్, ఏఓ సున్నం రాంబాబు, ఎస్‌ఓ భాస్కరన్, ఏపీఓ వేణు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, డీఎస్‌ఓ ప్రభాకర్ రావు, ఎల్‌టీఆర్ డీటీ మనిధర్, మేనేజర్ ఆదినారాయణ, గురుకులం ఏఓ నరేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, హెచ్‌ఈఓ లింగానాయక్, జేడీఎం హరికృష్ణ, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

మధిర: మధిర పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన గద్దల నాగమ్మ తన సమీప బంధువు మణిరాజు బైక్ పై వైఎస్సార్ చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ రోడ్డుకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను ఖమ్మం రిఫర్ చేశారు.

పెట్టుబడి పెడితే రెట్టింపవుతుందని టోకరా

- పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు
- విచారణ చేపట్టిన పోలీసులు

ఖమ్మంఅర్బన్/కారేపల్లి: దుబాయ్ కేంద్రంగా పని చేసే ఓ ఆన్‌లైన్ సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని ఆశ చూపారు. మరో ఇద్దరిని చేర్పిస్తే కమీషన్ రూపంలో డబ్బు వస్తుందని ఊదరగొట్టారు. మధ్యలో గోవా, బ్యాంకాక్ లాంటి ప్రదేశాలకు తీసుకెళ్తామని నమ్మబలికారు. తీరా చూస్తే ఉన్న డబ్బు పోయి మోసపోయామని గుర్తించి, చివరికి పోలీసులను ఆశ్రయించారు బాధితులు. కారేపల్లిలో ఓ ల్యాబ్ నిర్వాహకుడు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టగా.. టేకులపల్లికి చెందిన ఉపేందర్, కారేపల్లికి చెందిన రవికుమార్, రామనర్సయ్యతో పాటు మరో పదిమంది ఖమ్మానికి చెందిన ముగ్గురు వ్యక్తుల ద్వారా డిపాజిట్ చేసి, మోసపోయామని పోలీసులను ఆశ్రయించారు. కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాంను వివరణ కోరగా.. మెటాఫ్లస్‌కు సంబంధించిన బాధితులు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి ప్రాథమిక విచారణ చేపట్టామని చెప్పారు. ఇదే రకంగా మోసపోయిన కొందరు బాధితులు నగర ఏసీపీని కలిసి వివరించినట్లు తెలిసింది. ఏసీపీ సూచన మేరకు కొందరు బాధితులు ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా కొందరు ఫిర్యాదు చేయగా విచారణ చేట్టామని, గోవా ట్రిప్‌నకు కూడా తీసుకెళ్లినట్లు సమాచారం ఉందని, వీటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అసలు విషయం తెలుస్తుందని వెల్లడించారు.

ఫోర్జరీ సంతకంపై ఫిర్యాదు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి గ్రామ కార్యదర్శి కొడాలి రాధారాణి సంతకాన్ని అదే గ్రామానికి చెందిన చెరుకుపల్లి ముత్తయ్య ఫోర్జరీ చేశారని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాధారాణి 2021 నుంచి 2022 వరకు గ్రామ కార్యదర్శిగా పని చేసిన సమయంలో ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి ముత్తయ్య తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని చెరుకుపల్లి భవానీకి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ మేరకు కార్యదర్శి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద అక్రమంగా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని సీఐ భాను ప్రకాష్ తెలిపారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

చండ్రుగొండ: మండలంలోని బాలికుంట గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లతో కలకలం రేకెత్తించింది. వివరాలిలా ఉన్నాయి.. బాలికుంట పాఠశాలకు సోమవారం ఉదయం విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుడు రవికుమార్ హాజరయ్యారు. పాఠశాల భవనం వరండాలో పసుపు, కుంకుమతోపాటు నిమ్మకాయ, ఎండుమిర్చి, ముగ్గు వేసి ఉండటంతో విద్యార్థులు ఉలిక్కిపడ్డారు. గ్రామస్తులు పాఠశాలకు చేరుకోగా.. హెచ్‌ఎం రవికుమార్ వాటిని శుభ్రం చేయంచి పాఠశాల ప్రారంభించారు. సమాచారం అందుకున్న ఎంఈఓ సత్యనారాయణ, పోలీసులు పాఠశాలను సందర్శించారు. ఒకరోజు ముందు ఆదివారం కావడంతో ఎకరో ఆకతాయిలు ఇలా చేసి ఉంటారని ఎంఈఓ తెలిపారు.

జ్యూయలరీ దుకాణంలో చోరీ


చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ కేశవ్


చర్ల: మండల కేంద్రంలోని జ్యూయలరీ దుకాణంలో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి మెయిన్‌రోడ్‌లోని శ్రీలక్ష్మి నర్సింహ జ్యూయలరీ దుకాణం తాళాలు పగులగొట్టేందుకు యత్నించగా.. అవి పగలకపోవడంతో అక్కడి నుంచి భద్రాద్రిరామా జ్యూయలరీ దుకాణం వద్దకు వచ్చారు. తాళాలు పగలగొట్టి 3 కిలోల వెండి వస్తువులు, చిన్న బంగారు వస్తువులు, రూ.15 వేల నగదు, వెయిట్ మిషిన్లను చోరీ చేశారు. మొత్తం సొత్తు విలువ రూ.1.95 లక్షలు ఉంటుందని యజమాని పందిళ్లపల్లి శంకరాచారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వి.కేశవ్ కేసు నమోదు చేశారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐతోపాటు క్లూస్ టీం చేరుకుని వివరాలను సేకరించింది.

లారీ క్యాబిన్‌లో షార్ట్ సర్క్యూట్


షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన లారీ క్యాబిన్

వైరా: ఆగి ఉన్న లారీ క్యాబిన్‌లో ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ వద్ద సోమవారం ఉదయం కోల్‌కతా నుంచి మిర్యాలగూడెంనకు తౌడు లోడుతో వెళ్తూ ఆగింది. ఆ సమయంలో లారీ క్యాబిన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. షార్ట్ సర్క్యూట్‌తో క్యాబిన్ దగ్ధమై సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ తెలిపారు.

గల్లంతైన వ్యక్తి విగతజీవిగా..


మల్లేశ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకిన ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. వివరాలివీ.. కొత్తగూడెం పట్టణానికి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు వేముల మల్లేశ్ (68) ఇంట్లో గొడవపడి ఆదివారం ఉదయం భద్రాచలం వచ్చి గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. అదే రోజు మృతదేహం దొరక్క పోవడంతో సోమవారం గజ ఈతగాళ్ల, పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం దొరకడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కార్మికుడు అదృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని పాండురంగాపురంలో ఉంటూ పాలిష్ కార్మికుడిగా పనిచేస్తున్న బాలకృష్ణ కనిపించకుండా పోవడంతో సోమవారం ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గత నెల 23న పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని, అనేక చోట్ల ఆరా తీసినా ఆచూకీ లభించలేదని.. బాలకృష్ణ అత్త కోటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె, అల్లుడు పుట్టుకతో మూగవారని తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.